జగనన్న కాలనీలకు మౌళిక సదుపాయాలు : ఎంపీపీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రాష్ట్ర ప్రభుత్వం ఇల్లులేని నిరుపేదలకు జగనన్న కాలనీల పేరుతో ఇల్లు పట్టాలిచ్చి ఇళ్ళు నిర్మిస్తున్న లబ్ధిదారుల కాలనీలకు అన్ని మౌళిక సదుపాయాలు కల్పించటం జరుగుతుందని స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్పీటీసీ దుబ్బ వెంకటరావులు అన్నారు. హౌసింగ్ డే సందర్భంగా శనివారం మండలం కొత్తపల్లి జగనన్న కాలనీలను మండల ప్రత్యేక అధికారి మంద లోకనాథం, ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, గృహనిర్మాణశాఖ డీఈ సీతారమయ్యలతో కలిసి ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. తదుపరి గట్లపాడులో జగనన్న కాలనీని సందర్శించి ఎంపీపీ, జెడ్పీటీసీలు లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. అలాగే కొత్తపల్లి జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి మధ్యాహ్నభోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అలాగే కొత్తపల్లి పంచాయతీ పరిధిలోగల డిగ్రీ చదివిన నిరుద్యోగులు ఎమ్మెల్సీ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఈశ్వరమ్మ సూచించారు. అలాగే జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ బూతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ పాపినాయుడు, ఎలక్ట్రికల్ ఏఇ సురేష్, పిఆర్ ఏఈ లతశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కావ్య, ఉపాధిహమీ ఏ పి ఓ జి. హరిప్రసాద్, స్థానిక సర్పంచ్ ఇందు, ఎమ్పీటీసి రాము, సచివాలయ సిబ్బంది మరియు పలువురు నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

21న నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

విశాలాంధ్ర-నరసన్నపేట : ముఖ్యమంత్రి, ఈనెల 23వ తేదీన జిల్లా కు వస్తున్న నేపథ్యంలో వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 21వ తేదీన నిర్వహి స్తున్నామని శనివారం వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్.వి.ఎల్ కళ్యాణ మండపంలో 21వ తేదీ ఉదయం 10.30 గంటలకు జరిగే సమావేశానికి జిల్లా ఇంఛార్జ్ మంత్రి, బొత్సా సత్యన్నారాయణ అధ్యక్షత వహిస్తారని, జిల్లాలోని శాసనమండలి సభ్యులు, శాశన సభ్యులు, జెడ్పీ ఛైర్పర్సన్, డిసిసిబి, డిసిఎంఎస్ ఛైర్మన్లు, ఎంపిపిలు, జెడ్పీటిసిలు, మున్సిపల్ కౌన్సిలర్లు, నామినేటెడ్ సంస్థల ఛైర్మన్లు, కార్పొరేషన్ డైరక్టర్లు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ ఆఫీస్ బేరర్లు, ముఖ్య నాయకులు అంతా హాజరు కావాలని కృష్ణదాస్ కోరారు. కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించాలి

పలాస మున్సిపల్ ఛైర్మన్ గిరిబాబు

విశాలాంధ్ర-కాశీబుగ్గ : మండలంలో రామక్రిష్ణాపురం జగనన్న కాలనీలో మౌళిక సదుపాయాలు కల్పించాలని, ఆ దిశగా పనులు వేగవంతంగా చేపట్టాలని పలాస మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబు మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. శనివారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన జగనన్న కాలనీని పరిశీలించి కాలనీలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని, పనులు ప్రారంభించని వారితో పనులు చేపట్టే విధంగా అధికా రులు చర్యలు చేపట్టాల న్నారు. కాలనీలో తాగునీరు, విద్యుత్, మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆయనతో పాటు కమిషనర్ రాజగోపాల్, హౌసింగ్ ఎ.ఈ ధర్మేంద్రర్, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

నియోజకవర్గ స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు

కళాశాల ఆవరణలో ప్రారంభించిన యువనేత తమ్మినేని చిరంజీవి నాగ్

విశాలాంధ్ర-ఆమదాలవలస : ఆమదాలవలస పట్టణంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రాష్ట్ర స్థాయిలో జరిగనున్న సీఎం కప్ క్రీడా పోటీలకు సంబంధించి నియోజకవర్గ స్థాయిలో క్రీడాకారుల ఎంపిక పోటీలను వైసీపీ యువనేత తమ్మినేని వెంకట చిరంజీవి నాగ్ శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయెస్ జగన్మోహన్ రెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ప్రతిభా వంతులైన గ్రామీణ క్రీడాకారులకు సిఎం కప్ ఆటలు పోటీలు చక్కని అవకాశమని మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. విద్యార్థులకు ఆటలలో శిక్షణ ఇచ్చి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయులను చిరంజీవినాగ్ అభినందించారు. జెకె వెంకబాబు, బొడ్డేపల్లి రమణమూర్తి, ముదడ్ల రమణ, గురుగుబెల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మెళియాపుట్టి: మండలంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు సంబంధించి శనివారం నాడు భూమి పూజ చేసి పనులను స్థానిక ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. మండలంలో పట్టుపురం నుండి గొప్పిలి వైపుగా వెళ్లే ఎం ఎం రోడ్డులో రెండున్నర కిలోమీటర్లు ప్రత్యేక మరమ్మతు పనులకు సంబంధించి 61లక్షలు, జోడూరు గ్రామంలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా సుమారు 16 లక్షల రూపాయలతో అంగన్వాడీ భవన నిర్మాణ పనులను ఆయా సర్పంచులు సంపతి రావు లక్ష్మీ, బెజ్జిపల్లి సరోజినిల ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులు చేసే క్రమంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటుగా ఎంపీపీ ప్రతినిధి ఉదయ్ కుమార్, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వైఎస్ఆర్సిపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ ఆదిత్యలో ఘనంగా గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాలు

పుస్తక పఠనంతో విద్యార్థులంతా ఉన్నత శిఖరాలను చేరుకోవాలి : డా. దువ్వు చక్రపాణి

విశాలాంధ్ర-శ్రీకాకుళం : స్థానిక కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీకళాశాలలో గత వారం రోజులుగా జరుగుతున్న గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అంబేద్కర్ విశ్వవిద్యాలయం లైబ్రరీ సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దువ్వు చక్రఫాణి ఎస్. ఆర్ రంగనాథన్ చిత్రపటానికి పూలమాలవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యా ర్థులు కళాశాల యాజమాన్యం ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ప్రతీ ఒక్కరూ వినియోగించుకొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. గ్రంథాలయ పఠనంతో ఎంతోమంది జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో వినిపించి ఉన్నతస్థానాలను చేరుకున్నారని గుర్తు చేస్తూ ఆధునిక సాంకేతిక విజ్ఞానం ఎంతగా అభివృద్ధి చెందినప్పటికీ గ్రంథాలయాల ప్రాధాన్యత అలానే ఉంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ బి ఎస్ చక్రవర్తి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని, గ్రంథాలయాన్ని విద్యార్థినిలు ఉపయోగించుకోవలన్నరు. ప్రిన్సిపాల్ కె.శివ శంకర్ మాట్లాడుతూ పుస్తక పఠనం పై నేటి యువత సోషల్ మీడియాపై చూపిస్తున్నంత ఆసక్తి చూపించటంలేదన్నారు. విద్యార్థినిలు తప్పకుండా పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కళాశాల గ్రంథాలయాధికారి పి.వై కమల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతినిత్యం పత్రికలను, పుస్తకాలను, చదవాలని, భవిష్యత్ తరాలకు విజ్ఞానాన్ని అందించటానికి గ్రంథాలయాలను పరిరక్షించాలని తెలిపారు. గత వారం రోజులుగా నిర్వహించిన పలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు డాక్టర్ చక్రపాణి చేతులమీదుగా బహుమతులను ప్రధానం చేసారు. అనంతరం చక్రపాణిని కళాశాల యాజమాన్యం ఘనంగా శాలువాకప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.వెంకటప్పారావు, ఎన్ఎస్ఎస్ పీవో దామోదర్ రావు, మజ్జి శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకులకు సంస్కారం ఉందా?

మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ధ్వజం

విశాలాంధ్ర-కంచిలి : టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుతో పాటు ఆ పార్టీ నేతలకు అసలు సంస్కారం ఉందా అని మాజీ ఎమ్మెల్యే ఇచ్చాపురం నియోజకవర్గం సమన్వయకర్త పిరియా సాయిరాజ్ అన్నారు. ఈ మేరకు శనివారం కంచిలి ఎంపీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కర్నూలు సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడిన మాటలను చూస్తే ఆయనకు సంస్కారం ఉందా అని ప్రశ్నించారు. నేను రౌడీని, ఒక్కొక్కరికి చొక్కాలు విప్పి కొడతాననడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇదే చివరి ఎన్నికలు నన్ను గెలిపించండి అని ప్రార్థించి, తరువాత ప్రజలు విశ్వాసం కోల్పోయారని తెలుసుకొని ఇలా మాట్లాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ నర్తు రామారావు, ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రాందాస్, వైసీపీ మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పలికిల జయరాం, గొనప సింహాచలం, యారడి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలి

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సమన్వయంతో విజయవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. ఈ నెల 23వ తేదీన నరసన్నపేట మండలం నరసన్నపేట మండల కేంద్రం డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో శనివారం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పాట్లన్నీ బాగున్నాయని, ఆయా గ్రామాల నుండి రైతులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని, సమావేశానికి వచ్చే రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని తెలిపారు. సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో గత రెండేళ్లుగా రీసర్వే పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రీసర్వే పూర్తి చేసుకున్న ఆయా మండలాల రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు, భూరక్ష పథకం పట్టాలు పంపిణీ చేయనున్నట్లు వివరించారు. రీసర్వే పనులు పూర్తి చేసిన 350 గ్రామాల్లో రైతులకు పట్టాలు పంపిణీ చేస్తారన్నారు. 350 గ్రామాల్లో 1.20 లక్షల రైతులు లబ్ధి పొందుతున్నట్లు పేర్కొన్నారు. భూహక్కు పత్రాలు పంపిణీ శ్రీకాకుళం జిల్లా నుండి శ్రీకారం చుట్టనున్నారని పేర్కొన్నారు. ఎస్పీ జి.ఆర్ రాధిక మాట్లాడుతూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటుకు పక్క జిల్లా నుండి పోలీసులను తీసుకువస్తున్నట్లు వివరించారు. వాహనాలు పార్కింగ్ ఏర్పాటు చేసుకునేందుకు వీలుగా డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్ రీసర్వేకు సంబంధించి స్టాల్స్‌పై వివరించారు. రిజిస్ట్రేషన్ శాఖ ఏర్పాటు చేయనున్న స్టాల్స్ పై జిల్లా రిజిస్ట్రార్ వివరించారు. నాడు-నేడు స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఆర్ అండ్ బి ఎస్ఈ కాంతిమతి మాట్లాడుతూ బారీకేడింగ్ పనులు, తదితర పనులు జరుగుతున్నట్లు వివరించారు. రెవెన్యూ సీనియర్ జిల్లా అధికారులు వేదిక ఏర్పాట్లను ముందుగానే పరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం. నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ రెడ్డి, డిఎంహెచ్ఓ మీనాక్షి, అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, ఆర్ అండ్ బీ ఎస్ఈ కాంతిమతి, ఆర్డీఓ బి. శాంతి, డిటిసి శ్రీదేవి, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ ప్రసాదరావు, ఆర్డీఓ గంగాధర్, డిపిఓ రవి కుమార్, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, అగ్నిమాపక శాఖ జిల్లా అధికారి వీరభద్ర రావు, జడ్పీ సీఈవో వెంకటరామన్, డిఆర్డిఎ పిడి విద్యాసాగర్, సర్వే ఎడి ప్రభాకరరావు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ జయంతి, డిఎస్ఓ వెంకటరమణ, డిఎస్పీ శివరాం, తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులో భావనపాడు పోర్టు శంకుస్థాపన : మంత్రి సీదిరి

విశాలాంధ్ర-పలాస : సంతబొమ్మాళి మండలం భావనపాడు పోర్టు నిర్మాణానికి ఉన్న అడ్డంకులన్నీ తొలగిపోయాయని, డిసెంబరులో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి భూమి పూజ చేస్తారని రాష్ట్ర మత్స్య, పశు సంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. నూతనంగా నిర్మించిన ప్రగతి భవనంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు నిర్మాణా నికి న్యాయపరమైన సమస్యలు లేకుండా ఉండేం దుకు చర్యలు తీసుకున్నామని, భూములు అప్పగించే రైతుల్లో కూడా ఎటువంటి అపోహలు లేవని అన్నారు. పోర్టు పనులకు టెండర్లు కూడా రాష్ట్ర ప్రభుత్వం పిలిచిందన్నారు. ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం, మంచినీళ్లపేట జెట్టి స్థానంలో హార్బర్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి సూచనప్రాయంగా అంగీకరించారని, మరో 6 నెలల్లో వాటి నిర్మాణానికి అనుమతులు వస్తాయని తెలిపారు. రాష్ట్రంలో మచిలీపట్నం, రామయ్య పట్నం పోర్టుల పనులు ఇప్పటికే ప్రారంభ మయ్యాయని అన్నారు. అలాగే జిల్లాలో అనేక తీరప్రాంతాల్లో రూ. 25 లక్షల నిధులతో మినీ షిప్ ల్యాండ్ కేంద్రాలు నిర్మించేందుకు చర్యలు తీసు కుంటున్నామని తెలిపారు. ఆఫ్‌షోర్ రిజర్వాయరు పనులు పున: ప్రారంభానికి నిధులు మంజూరయ్యా యని, కోసంగిపురం, బెండిగేటు, మందస, హరి పురం, పూండి, వజ్రపుకొత్తూరు సెంట్రల్ డివైడింగ్ రహదారి నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. పలాస రైల్వే ఫ్లైఓవర్ వంతెన పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, 200 పడకల కిడ్నీ ఆసుపత్రి మరియు పరిశోధన కేంద్రం నిర్మాణాలు పూర్తి దశకు చేరుకున్నాయని తెలిపారు.

రాష్ట్రంలో ఒకే ఒక్కటి 'జాప్'

- పాత్రికేయుల సంక్షేమానికి రాజీలేని పోరాటం
- జాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. యుగంధర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : రాష్ట్రంలో ఒకే ఒక్క జాప్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని పాత్రికేయుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం యుగంధర్ రెడ్డి అన్నారు. శనివారం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఘనంగా జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 30వ వార్షికోత్సవం కార్యక్రమం స్థానిక ఎన్జీఓ హోమ్‌లో జరిగింది. జాప్ జిల్లా అధ్యక్షులు జి షణ్ముఖరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం యుగంధర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జాప్ అన్నది ఒకే ఒక్కటీ ఉందన్నారు. విభేదించేవారితో జాప్‌కు ఎటువంటి సంబంధంలేదని ఆయన స్పష్టం చేశారు. జాప్ పేరుతో ప్రకటనలు సమావేశాలు ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు దశాబ్దాల ప్రస్థానంలో అసోసియేషన్ ఎన్నో ఎదుర్కొందని వాటన్నింటిని అధిగమించి పాత్రికేయుల సంక్షేమమే లక్ష్యంగా రాజీలేని పోరాటం చేస్తున్నామని ఆయన చెప్పారు.

ఇందులో భాగంగా స్థానిక ఏపిహెచ్ బి కాలనీలో గల బెహరా మనోవికాస కేంద్రంలో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. జాప్ జిల్లా అధ్యక్షులు జి షణ్ముఖరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్ కొంక్యాన వేణుగోపాల్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా కన్వీనర్ శాసపు జోగినాయుడు, జాప్ జిల్లా కార్యదర్శి డాక్టర్ గంజి ఆర్ ఎజ్రా తదితరులు చేతులమీదుగా మానసిక చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వార్షికోత్సవ సంబరాలను ఈ కేంద్రంలో జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని జాప్ అధ్యక్షులు జి షణ్ముఖరావు అన్నారు. ఈకార్యక్రమంలో జాప్ కార్యదర్శులు రౌతు సూర్యనారాయణ, ఎంఏవీ సత్యనారాయణ, ప్రభాస్ సూర్య, దా. గెంజి. ఎజ్రా, సీపాన రమేష్ కుమార్, బి లక్ష్మణరావు, పి దుర్యోధన, బి ఆదిబాబు, బి గుణ, భాగ్యారెడ్డి, కె. రామారావు, జి. ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని పివైజి పుట్టుగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఝాన్సీ లక్ష్మీబాయి 194వ జయంతిని ప్రధానోపాధ్యాయుడు దేవదాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు దేవదాస్, విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేవదాస్ మాట్లాడుతూ ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వతంత్ర సంగ్రామంలో ఝాన్సీ లక్ష్మీబాయి ప్రముఖ పాత్ర పోషించిందని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్ఎంసి ఛైర్మన్ నీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

33 కిలోల గంజాయి స్వాధీనం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : సరిహద్దు ప్రాంతంలో నిషేదిత మత్తు పదార్థాల రవాణాను పట్టణ పోలీసులు శనివారం మరోసారి నిలువరించి నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుండి సుమారు లక్ష రూపాయల విలువైన గంజాయి, మూడు మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాదారులు ఏకంగా శ్మశానాన్ని తమ అడ్డాగా ఎంచుకున్నారు. పట్టణ పోలీస్ ఠాణా వద్ద సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.వి సతీష్‌కుమార్ పట్టణ ఎస్సై కె. గోవిందరావుతో కలిసి నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో వెల్లడించిన వివరాలమేరకు పురుషోత్తపురం గ్రామంవద్ద జాతీయ రహదారికి అవతల స్మశాన వాటిక వద్ద ముగ్గురు వ్యక్తుల ద్వారా గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు పట్టణ ఎస్సైకు సమాచారం అందింది. దాంతో పట్టణ పోలీస్ సిబ్బంది, డిప్యూటీ తహసిల్దార్, వి.ఆర్.ఓలతో కలిసి తనిఖీ చేయగా ముగ్గురు అనుమానిత వ్యక్తులు తారసపడ్డారు. వారిని ఒడిశా గంజాం జిల్లా గొళంత్ర పరిధి సుమండి గ్రామానికి చెందిన ఘనశ్యామ్ బెహరా(31), పురుషోత్తపురంకు చెందిన రెయ్యి త్రినాదం(21), పైల వాసు(32)లుగా గుర్తించి, అదుపులోకి తీసుకుని పరిశీలించగా వారి వద్ద అక్రమ రవాణాకు సిద్ధం చేసిన 33 కేజీల గంజాయి లభ్యమైంది. దాంతో వారిని అదుపులోనికి తీసుకోవ డంతోపాటు 3 సెల్‌ఫోన్స్, రవాణాకు ఉపయో గించడం కోసం సిద్ధం చేసి ఓ.డి.07 జి 9972 నెంబర్ గల అపాచీ ద్విచక్ర వాహనం స్వాధీన పర్చుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ బహిరంగ మార్కెట్లో సుమారు లక్ష రూపాయల వరకూ ఉంటుందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కలమట

విశాలాంధ్ర-కొత్తూరు : తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శనివారం మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ విస్తృత స్తాయి సమావేశంలో పాతపట్నం నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్యే కలమట వేంకట రమణ పాల్గొన్నారు.. నియోజకవర్గంలో పార్టీ తాజా పరిస్థితులను సమావేశంలో కలమట వివరించారు. పార్టీ సభ్యత్వాలు, బాదుడే బాదుడు కార్యక్రమంలో ప్రజలు స్పందన గురించి ఆయన తెలిపారు. ఇవన్నీ ఒక నివేదికగా పార్టీ అధినేత బాబుకు కలమట అందజేశారు. ఈసమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ కూడా పాల్గొన్నారు.

నవోదయకు న్యూ బ్రిలియంట్ విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-టెక్కలి : టెక్కలి న్యూ బ్రిలియంట్ కోచింగ్ సెంటర్‌కు చెందిన బెండి సాయిదీక్షిత (హాల్ టికెట్ నెంబర్ 1063337) 6వ తరగతి ప్రవేశానికి జరిగిన నవోదయ పరీక్ష ఫలితాల్లో రెండవ కౌన్సెలింగ్ నందు సీటు సాధించిందని డైరెక్టర్ దేవాది శ్రీనివాసరావు తెలిపారు. ఇదివరకు సైనిక్ పాఠశాలకు ముగ్గురు, నవోదయకు ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయ్యారని ఆయన తెలిపారు. ఎంపికైన సాయిదీక్షితకు ఉపాధ్యాయులు మణికుమారి, నవీన్ లు అభినందించారు.

శాంతిభద్రతలను పరిరక్షించాలి

కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలంలో శాంతి భద్రతలను పరిరక్షణలో పోలీస్ పాత్ర కీలకమని కాశీబుగ్గ డీఎస్పీ శివరామిరెడ్డి అన్నారు. ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ సందర్శించి, పలు రికార్డులు పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో కీలక పాత్ర వహించాలని, అలాగే పలు సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కక్షిదారులతో స్నేహ భావంతో మెలగాలన్నారు. గ్రామల్లో దిశ యాప్ పై మహిళలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈయనతో పాటు టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, స్థానిక ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అతిక్రమణలు లేకుండా అనుమతులు : కలెక్టర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అతిక్రమణలు లేకుండా అనుమతులు మంజూరుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో సోషల్ ఫారెస్ట్ కమిటీ సమావేశం ఆర్‌ఓఎఫ్ఆర్‌లపై ఐటిడిఏ పిఓ బి.నవ్య, జిల్లా అటవీ శాఖ అధికారి నిషా కుమారిలతో ఆయన శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బందవసాయి నుండి కొనక (బందలా సాయి నుండి దొనకాయమెట్ట) రీచ్ - 1, రీచ్-2 రెండు రహదారులు పై జిల్లా స్థాయి కమిటీలో చర్చించి సాధ్యాసాధ్యాలపై అనుమతులు మంజూరుకు తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చే సమావేశం నాటికి ఫోటోలుతో రిపోర్టు అందజేయాలని ఈఈని ఆదేశించారు. రహదారుల అనుమతులపై జిల్లా కలెక్టర్ తో ఐటిడిఏ పిఓ బి.నవ్య, అటవీ శాఖ అధికారి నిషా కుమారిలతో రహదారులపై చర్చించారు.

ఇందిరా గాంధీకి ఘననివాళి



విశాలాంధ్ర-రణస్థలం : మండలకేంద్రంలో ఉన్న శాఖా గ్రంధాలయంలో 55వ గ్రంధాలయ వారోత్సావాల్లో భాగంగా శనివారం మహిళల దినోద్సవం పురస్కరించుకొని మాజీ ప్రదాని శ్రీమతి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు రంగవల్లి పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 73 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయలు సునీత, లక్ష్మణరావు,నారాయణరావు, గ్రందాయాధికారి పి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నార.

చంద్రబాబు వ్యవహార శైలి మార్చుకోవాలి : ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర-టెక్కలి : కర్నూల్‌లో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసి ప్రాంతీయ విభేదాలు రెచ్చగొట్టిన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యవహార శైలి మార్చుకోవాలని, లేదంటే పరాభవం తప్పదని ఎమ్మెల్సీ, టెక్కలి నియోజకవర్గ శాసనసభ వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం ఆయన దివ్వల రమాబాయి భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలు శతశాతం కైవసం చేసుకుంటామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రకటించడంతో ఇంగిత జ్ఞానం కోల్పోయిన చంద్రబాబునాయుడు ఇలా దూషణలకు పాల్పడడం క్షమించరాని నేరమని దుయ్యబట్టారు. ఈకార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు అట్ల. సరోజినమ్మ, పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన. జనకమోహన్ (చంటి), మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల. సుజాత, ఉప సర్పంచ్ గండి. విశ్వశాంతి రెడ్డి, టెక్కలి మండల పార్టీ అధ్యక్షులు బగాది. హరి, టెక్కలి మండల మహిళా కన్వీనర్ దివ్వల. మాధురి, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, సీనియర్ పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు కోర్టును జిల్లా అదనపు న్యాయమూర్తి సందర్శన

విశాలాంధ్ర-పొందూరు: పొందూరు జుడిషియల్ ఫస్టుక్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును శనివారం రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి గొర్లె చక్రపాణి సందర్శించారు. ఈసందర్భంగా పొందూరు కోర్టుకు శాశ్విత భవనం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని, అలాగే కోర్టులో జనరేటర్ను ఏర్పాటు చేయాలంటూ బార్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు వినతి అందించారు. అనంతరం వార్షిక తనికీలో భాగంగా పలు కేసులకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఈయనతో పాటు రాజాం జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి. కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంచరాన రమణమూర్తి, న్యాయవాదులు రఘు బాబు, అశోక్, కిరణ్, సురేష్, కృష్ణారావు, రంగారావు, రామ్మోహనరావు, రాము, బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి అవమానం

విశాలాంధ్ర-పలాస : పలాస ఉదయపురం ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతిదేవి విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ఉదయం పాఠశాలకు వచ్చేసరికి సరస్వతిదేవి విగ్రహం ధ్వంసం చేసినట్లు గుర్తించారు. ఇటీవలే పాఠశాల ఆవరణలో సరస్వతిదేవి విగ్రహాన్ని ఆవిష్కరించా రని, రాత్రి సమయం లో సరస్వతి దేవి విగ్ర హాన్ని ధ్వంసం చేశారని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయులు దుర్గా ప్రసాద్ కాశీబుగ్గ పోలీసులకు, పలాస ఎంఇవో సి.హెచ్.శ్రీనివాసరావుల దృష్టికి తీసుకెళ్లారు.

డిగ్రీ మూడో సెమిస్టర్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర-ఎచ్చర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల రెగ్యులర్ విద్యార్థుల మూడో సెమిస్టర్ ఫలితాలను శనివారం విడుదల చేసినట్లు డాక్టర్ ఎస్ ఉదయ్ భాస్కర్ తెలిపారు. బిఎస్సి లో 9,421 మందికి 3,366 మంది, బిఎ కోర్సులో 2,060 కు 877 మంది బీకాంలో 2,191 కు 680 మంది బిసిఏలో 80 57 మంది బీబీఏలో 127 లో 72 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని వివరించారు. మొత్తం అన్ని కోర్సుల్లో కలిపి ఈ పరీక్షలకు 13,879 మంది విద్యార్థులు హాజరుకాగా 5,052 మంది ఉత్తీర్ణులే 36.40శాతం ఫలితాలు సాధించాలని చెప్పారు. ఈ ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్సైట్లో అందుబాటులో ఉంచామన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే ధ్యేయంగా శ్రద్ధ వహించాలి



విశాలాంధ్ర-పొందూరు: పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో శతశాత ఉత్తీర్ణతే ధ్యేయంగా పిల్లలు శ్రద్ధ వహించాలని ప్రిన్సిపాల్ సిహెచ్ ప్రభాకర్ రావు అన్నారు. మండలం వావిల్లిపల్లి పేట ఆదర్శ పాఠశాలలో శనివారం తల్లిదండ్రుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో కోట్లాది రూపాయలు వెచ్చించి మెరుగైన సౌకర్యాలు కల్పనలో పిల్లలకు విద్య బోధన నిర్వహిస్తున్న దృశ్య విద్యార్థుల తల్లిదండ్రులుపిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రతి పిల్లవాడు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై జిల్లాకే ఆదర్శవంతంగా వావిల్లి పల్లి పేట పాఠశాలను ఉంచాలన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, విద్య పై ప్రత్యేక ఆసక్తి చూపుతూ ప్రథమ శ్రేణిలో ప్రగతి బాటలో నిల వాలన్న ఉపాధ్యాయ ఆశయాలకు నెరవేర్చే దశగా పిల్లలు ఇంటి వద్ద ప్రత్యేక శ్రద్ధతో చదివించే విధంగా చూడాలని పేరెంట్స్ కి కోరారు. పాఠశాలలో పూర్తిస్థాయిలో నీటి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు చెరువులకు వెళ్ళొస్తున్నారని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని విద్యార్థుల వెళ్లకుండా చూడాలని నీటి సౌకర్యం కల్పించేందుకు తనదైన శైలిలో ఆర్థిక సహాయాన్ని అందించేందుకు ముందుకు వస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మండల స్థాయి స్విమ్మింగ్ పోటీలు

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : శనివారం పట్టణంలో కంద్రకోనేరులో అండర్-19 స్విమ్మింగ్ పోటీలకు ఎంపికలను జిల్లా కోచ్ సుభాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 50మంది యువత ఈ పోటీల్లో పాల్గొననగా వారికి సుభాన్ ప్రత్యేక శిక్షణనిచ్చారు. మండల ఇన్‌చార్జి కోచ్ బి.రామారావు, పీ.ఈ.టీ రఘుమోహన్, సుభాష్, గణేష్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మి యాగంలో పాల్గొన్న ధర్మాన కృష్ణదాస్

విశాలాంధ్ర-నరసన్నపేట: మండలంలోని మడపాం గ్రామంలో వున్న శ్రీ విరాట్ విశ్వ అభయ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీ మహాలక్ష్మి యాగంలో మూడవ రోజు జరిగిన పూర్ణాహుతి కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా దేవీ ఉపాసకులు, శృంగారం లక్ష్మీ ధనుంజయ శర్మ, స్మార్తగమ పండితులు, జోస్యుల గోపిబాబుతో పాటు మరో 12మంది రుత్వికుల పర్యవేక్షణలో వేదమంత్రాల ఉచ్ఛరణలో ప్రత్యేక పూజలు చేశారు.

సిఎం కప్ క్రీడలు ప్రారంభించిన కృష్ణదాస్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శనివారం నియోజకవర్గ సిఎం కప్ క్రీడలను వైసిపి జిల్లా అధ్యక్షులు, ఏపి ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ధర్మాన కృష్ణదాస్ ప్రారంభించారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో నియోజకవర్గంలోని నరసన్నపేట, పోలాకి, జలుమూరు, సారవకోట మండలాల పాఠశాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పిడి, వై.పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి సీఎం ప్రకటన చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి, కార్యదర్శివర్గ సభ్యులు

విశాలాంధ్ర-శ్రీకాకుళం కలెక్టరేట్ : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన రెడ్డి శ్రీకాకుళం జిల్లా పర్యటన లో సమస్యలు పరిష్కరించి జిల్లా అభివృద్ధికి ప్రకటన చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, కార్యదర్శి వర్గ సభ్యులు బి కృష్ణమూర్తి గారు, కె మోహన్ రావు డిమాండ్ చేశారు, ముఖ్యమంత్రి నవంబర్ 23వ తేదీన శ్రీకాకుళం వస్తున్న సందర్భంగా సిపిఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడుతూ నేరడి వద్ద వంశధారపై బ్యారేజీ నిర్మించి రెండు పంటలకు నీరు ఇచ్చి జిల్లాను సస్యశ్యామలం చేయాలని వారు డిమాండ్ చేశారు. జిల్లాలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లేకపోవడం వల్ల ఏ ప్రమాదాలు జరిగినా శ్రీకాకుళం నుండి విశాఖపట్నం వెళ్లే లోపు అనేకమంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని కావున రిమ్స్‌ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా అప్గ్రేడ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. వంశధార నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించి వెంటనే పనులు ప్రారంభించి నిర్మించాలని వారు డిమాండ్ చేశారు.

పేదల పునాధులు తొలగించడం అన్యాయం

విశాలాంధ్ర-పలాస : కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో పేదల ఇళ్ల పునాధులు తొలగించడం అన్యాయమని, పేదలకు న్యాయం జరిగే వరకు పోరాటాలు చేస్తామని పలాస సిపిఎం నాయకులు ఎస్.గణపతి అన్నారు. కాశీబుగ్గ సూదికొండ ప్రాంతంలో పేదల ఇళ్ల పునాధులు తొలగించడంపై శనివారం ఆయన బాధితులతో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారిగుడి కోసం పేదల ఇళ్ల పునాధుల తొలగించి వారిని ఇబ్బందులు చేయడం తగదన్నారు. కొంతమంది లక్షలాది రూపాయలతో స్థలాలు కొనుగోలు చేసుకున్నారని, మరికొంతమంది పునాధులు వేసుకున్నారని, వారికి ఎటువంటి సమాచారం లేకుండా రాత్రిరాత్రి యంత్రాలతో పునాధులను ధ్వంసం చేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత పాలకులు, అధికారులు చొరవ చూసి వారికి న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు బాధితులు క్రిష్టారావు, నౌగాప వీరాస్వామి, పి.రమేష్, బి.గోపి, ఎం.నిర్మలలు ఉన్నారు.

ఎన్‌సీసీకి 74 మంది ఐతమ్ విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-టెక్కలి: టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో 2022-2023 విద్యా సంవత్సరంలో ఎన్ సిసి ప్రవేశాల కొరకు 14 ఆంధ్రా బెటాలియన్ ఎన్సిసి శ్రీకాకుళం శాఖ కమెండింగ్ అధికారి కల్నల్ అమిత్ బెనర్జీ ఆధ్వర్యంలో శనివారం 320 మంది విద్యార్థులకు శారీరక దారుఢ్య పోటీలు నిర్వహించి 74 మందిని ఎంపిక చేసినట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కల్నల్ అమిత్ బెనర్జీ, ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్య స్థాయిలో ఎన్సిసి విభాగం ఉండడం ఒక మంచి శుభపరిణామమన్నారు. ఐతమ్ 2020-202 1 విద్యాసంవత్సరం నుండి ఎన్సిసి ప్రారంభమైందని మొదటి ఏడాది 54 మంది, రెండో ఏడాది 60 మంది, ఈ విద్యాసంవత్సంలో 74 మంది ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ఏ .ఎస్.శ్రీనివాసరావు, సుబేదార్ వి.నానాజీ, నాయక్ సుబేదార్ భూపేంద్రసింగ్, హవల్దార్ ఎల్.వి.రమణ, ఎన్సిసి డీన్ ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి, ఐతమ్ ఎన్సిసి లెఫ్టినెంట్ ఆఫీషర్ టి.మురళీ మోహన్రావు, ట్రైనింగ్ ఇనస్పెక్టర్ ఎన్.భుజంగరా వు, పలువురు డీన్లు, హెచ్డిలు ఎన్సిసి వలంటీర్లు పాల్గొన్నారు.

దిశా చట్టంపై అవగాహన అవసరం : ఎంపీడీఓ ఉమాసుందరి

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : విద్యార్థినీలు, మహిళలకు, ఎంతగానో ఉపయోగపడుతున్న, దిశా చట్టంపై, అవగాహన అవసరమని సంత బొమ్మాళి ఎంపిడిఓ జి.ఉమాసుందరి, నౌపడ మాజీ సర్పంచ్ పీరుపల్లి కృష్ణవేణి రాజశేఖర్ అన్నారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా, సంతబొమ్మాళి, నౌపడ శాఖా గ్రంధాలయాల్లో ఉన్న చిత్రపటాల వద్ద జ్యోతి ప్రజ్వలన చేశారు. అలాగే పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంధాలయాల 55 వారోత్సవాలు సందర్భంగా, ఇప్పటివరకు జరిగిన వివిధ రకాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులు పేర్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రంధాలయాల అధికారులు బి.రూపావతి, కె.కృష్ణారావు, పాటశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రబీ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : రబీలో సాగుచేసే మినప, పెసర, వేరుశెనగ తదితర పంటలలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి కె. శ్రీథర్, జిల్లా వనరుల కేంద్రం ఉప సంచాలకులు త్రినాధస్వామిలు అన్నారు. ఆయన శనివారం కొత్తపేట రైతు భరోసా కేంద్రంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమంలో సిబ్బందితో నిర్వహించిన పొలంబడి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని అవగాహన కల్పించారు. రబీ సాగులో రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, అలాంగే పంట మార్పిండి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఏడీలు ఆర్. రవిప్రకాష్, వెంకటరావు, ఏఓలు సూర్యకుమారి, ఎస్. గోవిందరావు, రెండు మండలాల వ్యవసాయ అధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 22 నుంచి డిగ్రీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

విశాలాంధ్ర-ఎచ్చర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థుల నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 22వ తేదీ నుంచి యధావిధి గానే జరుగుతాయని వర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ సిహెచ్ఎ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. విద్యార్థులు ఇంటర్నషిప్ లో ఉన్నందున సిలబస్ పూర్తి కాలేదని పరీక్షలు వాయిదా వేయలని వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులు విన్నవించారన్నారు. దీనిపై వర్సిటీ వీసీ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్ తోవర్చువల్ విధానంలో మాట్లాడి సిలబస్ పూర్తి విషయంపై ఆరా తీశారని చెప్పారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేశామని డిగ్రీ ప్రిన్సిపాల్ ఇచ్చిన సమాచారం మేరకు యధావిధి గానే పరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. పరీక్షలు వాయిదా వేస్తే విద్యా సంవత్సరం ఆలస్యమై విద్యార్థులకు పలు ఇబ్బందులు ఎదురవుతాయని చెప్పారు. విద్యార్థుల సౌలభ్యం కోసమే ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్, సదాశివుని కృష్ణ

విశాలాంధ్ర-నరసన్నపేట : ఈనెల 23వ తేదీన నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరగనున్న ముఖ్యమంత్రి, జగన్ మహాసభను ప్రతీ శిష్టకరణం కుటుంబీకులు విధిగా పాల్గొని, విజయవంతం చేయాలన్నారు. శనివారం ఆయన శిష్టకరణ కులస్థుల ప్రధాన నాయకులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈసంధర్భంగా డైరెక్టర్, కృష్ణ మాట్లాడుతూ శిష్టకరణ కులాన్ని బిసి-డిలో చేర్పించిన ఘనత దివంగత రాజశేఖరరెడ్డిదని, ప్రతీ శిష్టకరణ కుటుంబం జీవితాంతం వైఎస్ కుటుంబానికి రుణపడి వుండాలని తెలిపారు. మాజీ ఉప ముఖ్యమంత్రి, ధర్మాన కృష్ణదాస్ నాయకత్వంలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సదాశివుని ప్రభాకరరావు, డి.వి.రఘు, వటి రామ్మోహన్‌రావు, ఎం.వి.జె.మోహన రావు, అంపలాం వసంత కుమార్, చౌదరి కాంతారావు, రఘుపాత్రుని వైకుంఠరావు, సదాశివుని సింహాచలం, ఉరిటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిని దాసునాయుడు పరామర్శ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం రంకుహనుమంతుపురం పంచాయతీకి చెందిన, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు గోక ఆనందరావు ను, జిల్లా తెలుగుదేశం పార్టీ యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు పరామర్శించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఒక ప్రయివేటు ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. స్థానిక తెలుగుదేశం నాయకులు సమాచారం మేరకు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి.క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆయనతోపాటు తెలుగుదేశం కార్యకర్తలు ఉన్నారు.

ఏపీ ఎన్జీఓ నూతన కార్యవర్గం

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్జీఓ స్థానిక శాఖ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యదర్శి చల్లా శ్రీనివాసరావు ఎన్నికల అధికారిగా ఎన్జీఓ హోంలో నిర్వహించి ఎన్నికల్లో అధ్యక్షునిగా మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ కె.శ్రావణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా మణిచంద్ర, ఉపాధ్యాక్షులుగా ఎస్.క్రిష్ణ, కె.శ్రీనువాసరావు, ఎస్.మల్లేశ్వరరావు, కార్యదర్శిగా ఎస్.క్రిష్ణ, ప్రధాన కార్యదర్శులుగా బి.నీలవేణి, వి.ప్రవీణ్, రోషిణి, పి.వాణి, కోశాధికారిగా ఎస్డీ పవన్‌కుమార్‌లు ఎన్నికయ్యారు.

అరబిందో ఆడిట్స్ విజయవంతం : రాజు

విశాలాంధ్ర-రణస్థలం : మండలంలో పారిశ్రామికవాడ పైడిభీమవరంలో ఉన్న అరబిందో పరిశ్రమకు సంబందించిన అన్నిరకాలు అడిట్లు విజయవంతమయ్యాయని అరబిందో పరిశ్రమ కార్పోరేట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ యుఎన్‌బి రాజు తెలిపారు. శనివారం పరిశ్ర ఆవరణలో యూనియన్, కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కోవిడ్ తదనంతరం ఉత్పంద మైన విపరీత పరినామాలతో అనేక రంగాలుతో పాటు ఫార్మా పశ్రమకు కూడా ఒడుదొడుకులు ఎదుర్కొందని వివరించారు. పరిస్థిలకు తగ్గట్టు కార్మికుల కూడా అన్నివిదాలుగా సహకరించి నందకు వారికి అభినందనలు తెలిపారు. అలాగే ముదు సరుకులు ధరలు అంతర్జాతీయ విపణి రూపాయి డాలరు మారకం విలువలు అంతరాలు విపరీతంగా పెరిగిన ఉత్పత్తి వ్యయం, రవాణా తదితర సంబంది ఖర్చులు పెరిగాయన్నారు. అరబిందో పరిశ్రమపై తీవ్రమైన దుష్ప్రబావం పడిందని రాజు విశదీకరించారు. ఇటువంటి పరిస్థిలు సమర్ధవంతంగా ఎదర్కొనెందకు కార్మికులు సిద్దంగా ఉండాలని చూసించారు. పరిశ్రమ సంబందిత విషయాలన్ని కార్మికులకు వివరించారు. ఈ సమావేశంలో పరిశ్రమ ప్రతినిధులు కె కమలాకర్‌రెడ్డి, పి.తిరుమలరావు, పి.గౌరీశంకర్ కుమార్,డి సుందరరావు, కాంట్రాక్టు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-మందస : రైస్‌మిల్లులను వెంటనే తెరిపించి కార్మికులను ఉపాధి కల్పించాలని శ్రీబొట్టేశ్వర మోడరన్ రైస్‌మిల్ కార్మికులు సిఐటియు నాయ కులు శనివారం తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ మందసలోని బొట్టేశ్వర మోడరన్ రైస్ మిల్లును చీపి రోడ్డుకు మార్పు చేయడంతో 40 ఏళ్ళుగా హమాలీలుగా పనిచేస్తున్న వారికి ఉపాధి లేకుండా పోయిందని అన్నారు. రైస్‌మిల్లు తెరిచే, కార్మికులను ఆదుకోవాలని కోరారు.

బాలలకు చిత్రలేఖన పోటీలు

విశాలాంధ్ర-హిరమండలం : 1098 ద్వారా బాలల వారోత్సవాలు పాతపట్నం బ్రైడ్స్ సంస్థ ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ ఇండియా పౌండేషన్ వారి సౌజన్యంతో శనివారం హిరమండలం కేజీబివి స్కూల్‌లో 8,9,10 క్లాసుల బాలలతో చిత్రలేఖనం (డ్రాయింగ్) వేయించారు. ఈ సందర్భంగా ఎస్ ఓ ఎస్ కృష్ణవేణి, చైల్డ్‌లైన్ కొర్డినేటర్లర బాలలకు బహుమతులు అందించారు. ఈకార్యక్రమంలో కేజీబివి సిబ్బంది, చైల్డ్‌లైన్ సిబ్బంది నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రేడ్స్ జగన్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

విశాలాంధ్ర-పలాస :ఖరీఫ్ అనంతరం ఆరుతడి పంటలపై రైతులు దృష్టిసారించాలని, వీటి ద్వారా అధిక లాభాలు పొందవచ్చునని పలాస వ్యవసాయ శాఖ ఎ.వో కిల్లి పోలారావు అన్నారు. శనివార వీరభద్రపురం గ్రామంలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ క్లస్టర్ డెమోన్స్ట్రేషన్ పథకంలో భాగంగా పెసర, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్ ఆపరాలు విస్తీర్ణం గణనీయంగా తగ్గుతుందని, ప్రతి ఒక్కరు ఆరుతడి పంటలు పండించేందుకు ముందుకు రావాలన్నారు. రైతులకు నూతన పద్దతులు, మెలుకవులుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాపారా శాఖ ఎ.ఈ.వో ఎస్.పాపా రావు, మాజీ సర్పంచ్ టి.కృష్ణమూర్తి, కె.సత్యవతి, రైతులు మాధవయ్య, పి.మోహనరావు, వైగణపతి రావులు పాల్గొన్నారు.

65 మంది వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు

కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: జిల్లాలో కొత్తగా 65 మంది రంగస్థల వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు కానున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ లాఠకర్ పేర్కొన్నారు. వృద్ధకళాకారుల పింఛన్ల జిల్లా స్థాయి ఎంపిక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన శనివారం కలెక్టర్ ఛాంబరులో జరిగింది. ఈ కమిటీకి సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ చైర్మన్ కాగా జిల్లా పౌర సంబంధాల అధికారి కన్వీనరుగాను, జిల్లా పర్యాటక అధికారి, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సభ్యులుగా వ్యవహరించారు. జిల్లాలో కొత్తగా వృద్ధ కళాకారుల పింఛన్లు కొరకు 90 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వం నిర్దేశించిన మార్గ దర్శకాలను అనుసరించి 65 మంది వృద్ధ కళాకారులు అర్హులుగా గుర్తించినట్లు కన్వీనర్ జిల్లా కలెక్టర్ కు, చైర్మన్ కు వివరించారు. అర్హులైన 65మంది కళాకారుల జాబితాను జిల్లాస్థాయి ఎంపిక కమిటీ ఆమోదంతో ముఖ్య కార్యనిర్వహణాధికారి, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి,విజయవాడ వారికి సమర్పించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనకు ముందు 686 మంది వృద్ధ కళాకారులకు పింఛన్లు మంజూరు కాబడ్డాయన్నారు. ఈసమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు (ఇన్ ఛార్జ్) ఆర్.గడ్డమ్మ, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణ రావు, జిల్లా పౌర సంబంధాల అధికారి కె.బాలమాన్ సింగ్, ఆడియో విజువల్ సూపర్ వైజర్ జి.వి.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇప్పిలి వంశ కీర్తికి శత జయంతి

బ్రోచర్ ఆవిష్కరించిన శ్రీసుమిత్రా కళా సమితి

విశాలాంధ్ర-అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి శ్రీసూర్యనారాయణస్వామివారి సేవలో తన జీవితాన్ని అంకితం చేయడంతో పాటు సంగీత సాహిత్య కళా సామాజిక సేవా రంగాల్లో విశేష సేవలందించి చారిత్రకంగా పేరొందిన కళాకారుల తో సిక్కోలులో ప్రదర్శనలు నిర్వహించిన తమ తండ్రి ఇప్పిలి జోగారావు శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్టు కుమారులు ఇప్పిలి శంకరశర్మ, ఇప్పిలి జోగి సన్యాసిరావు తెలిపారు. అరసవల్లిలోని తమ స్వగృహంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో శంకరశర్మ మాట్లాడుతూ అరసవల్లి ప్రాశస్త్యాన్ని నలుదిశలా చాటిచెప్పేలా తమ తండ్రి ఇప్పిలి జోగారావు విశేష కృషి చేశారన్నారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సభ్యునిగా ఉన్న రోజుల్లో నాటి ప్రధాని జవహర్లాల్ నెహ్రూతో సాన్నిహిత్యంతో పాటు నాటి ముఖ్య మంత్రులు, జిల్లాకు చెందిన ప్రముఖ రాజకీయవేత్త బొడ్డేపల్లి రాజగోపాలరావుతో సన్నిహిత సంబం ధాలు జోగారావుకు ఉండేవన్నారు. అటు సమాజసేవలో ఉంటూనే ఇటు సంగీతం, సాహిత్యం, కళలను ప్రోత్సహిస్తూ కళాకారులను పోషించే విధంగా కార్యక్రమాలు నిరంతరం నిర్వహించేవారన్నారు. ప్రఖ్యాత కళాకారులు బిస్మిల్లా ఖాన్, మంగళంపల్లి బాలమురళీ కృష్ణ వంటి పెద్దలతో అరసవల్లిలో ప్రదర్శనలు ఇప్పించిన ఘనత జోగారావుదేనన్నారు. స్వతహాగా సూర్య ఆరాధకుడు కావడంతోపాటు సంగీతంలో ప్రావీ ణ్యత ఉన్న జోగారావు కళాభిమానిగా కళాకారులను ప్రోత్సహించేందుకు నిరంతరం పనిచేశారని శంకరశర్మ తెలిపారు. తమ ఇప్పిలి కుటుంబంలో అందరినీ ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు అహరహం శ్రమించిన జోగారావు సంస్మరణార్థం శతజయంతి వేడుకలు మూడు రోజులపాటు శ్రీకాకుళం నగరంలోని బాపూజీ కళామందిర్లో నిర్వహిస్తున్నా మన్నారు. ఈనెల 30 డిసెంబర్ 1, 2 తేదీల్లో ప్రఖ్యాత నాధస్వర, వేణువు, డోలు, వయోలిన్, మృదంగం కళాకారుల ప్రదర్శనలు తమ కుటుంబం అందరం సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు శంకర శర్మ వివరించారు. తమ తండ్రి అటు అరసవల్లికి, ఇటు కళా సాంస్కృతిక సేవారంగాలకు అందించిన సేవలకుగాను నిర్వహిస్తున్న వంద వసంతాల వేడుకల్లో కళాభిమానులు, కళాకారులు, ఇప్పిలి వంశ శ్రేయోభిలాషులందరూ పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శ్రీ సుమిత్రా కళాసమితి ప్రధాన కార్యదర్శి గుత్తు చిన్నారావు, కోశాధికారి నక్క శంకరరావు, ఉపాధ్యక్షులు మండవిల్లి రవి, కిల్లాల ఫల్గుణరావు, డి.పార్థసారథి, కొమనాపల్లి సురేష్, ప్రధాన విజయరాం, ఎం. వరలక్ష్మి, పి.సంగీత, యు.పూజ, మల్లిమొగ్గల రాజు, జి.రాజు వెంకట్, మావూరు కృష్ణారావు, ఇప్పిలి వంశ ప్రతినిధులు, ఇప్పిలి షన్ముఖశర్మ బృందం బ్రోచర్ ను ఆవిష్కరించారు.

ఘనంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం స్పోర్ట్స్/క్రైం: ఉక్కు మహిళ మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని ఇందిరా విజ్ఞాన భవన్లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరా గాంధీ విగ్రహానికి, చిత్రపటానికి డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి, కాంగ్రెస్ నాయకులు పూల మాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ ఇందిరా గాంధీ ఎంతో క్రమశిక్షణతో ఎంతో దేశభక్తితో ఉండేవారని, తన తండ్రి స్వాతంత్ర ఉద్యమాల్లో పాల్గొంటూ జైలుకు వెళ్లినప్పుడు తన సొంతంగా వానర సేన నడిపించి దేశ స్వాతంత్ర పోరాటంలో భాగస్వామి అయిన గొప్ప దేశభక్తురాలని కొనియాడారు. నేటి యువతకు ఆవిడ మార్గదర్శకరాలు, స్వాతంత్ర ఉద్యమంలో విదేశీ వస్తువులను తగలబెట్టి నా సందర్భంలో తనకు ఎంతో ఇష్టమైన బొమ్మను సైతం తెదించిన గొప్ప దేశభక్తురాలన్నారు. ఇందిరా గాంధీ జన్మదిన సందర్భంగా గార మండలం నుంచి సావాడ బాలకృష్ణారెడ్డి, ఒప్పంగి రాము, ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి వంకర పెంటయ్య డిసిసి అధ్యక్షులు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలో దేశేళ్ల గోవింద మల్లిబాబు, అంబటి కృష్ణారావు, దన్నాన భోగి నాయుడు, బొత్స రమణ, అంబటి దాలినాయుడు, లఖినేని సాయిరాం, ముద్దాడ లక్షణ, రమేష్ కుమార్,అప్పారావు, ఆబోతుల వెంకట నాయుడు, వి.రాము, రెహమాన్ మొదలగువారు పాల్గొన్నారు.

టెక్కలిలో: ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని స్థానిక ఇంద్రమ్మ జంక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టెక్కలి కాంగ్రెస్ నాయకులు సీనియర్ కాంగ్రెస్ నాయకలు కోట చిన్న బాబు, బమ్మిడి ముఖలింగం, పొట్నూర్ రామ్మూర్తి నాయుడు, రిక్క సూర్య కుమారి, తంగుడు అప్పారావు మురళీలను శాలువతో సత్కరించారు. అనంతరం 150 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ అధ్యక్షులు కోత మధుసూదనరావు అధ్యక్ష స్వాగతోపన్యాసం చేయగా జిల్లా అధికార ప్రతినిధి పెదాడ పరమేశ్వరరావు, సేవాదళ్ జాతీయ కార్యదర్శి బమ్మిడి గంగాధర్, రాష్ట్ర బీసీసెల్ అధ్యక్షులు సనపల అన్నాజీ రావు, ఇంచార్జి చింతాడ దిలీప్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు లలితా ఈశ్వరి, రాష్ట్ర ఐటీ సెల్ కన్వినర్ భాస్కరబాబు జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పలాసలో : మథర్ థెరిస్సా పాఠశాలలో అంతర్జాతీయ మెన్స్ దినోత్సవం, దివంగత ప్రధాని ఇందిరాగాంధీ 105వ జయంతి వేడుకులను శనివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ వ్యవస్థలో కుటుంబ వ్యవస్థను, మగవారు తీసుకుంటే ఇంటి సంరక్షణ బాధ్యత మహిళలు తీసుకున్నారన్నారు. ఇందిరాగాంధీ అడుగు జాడల్లో నడవాలని, ఆమెను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు అదిరోహించాలని అన్నారు. కార్యక్రమంలో మథర్ థెరిస్సా కారస్పాండెంట్ వజ్జ గంగాభవానీ, ఉపాధ్యాయులు ప్రసాదరావు, సాసుమాన చంద్రమౌళి, జగదీష్ పండా, నెమలపురి తులసిరావు, జోగారావులు పాల్గొన్నారు.

రణస్థలంలో : ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండల కేంద్రంలో ఇందిరా గాంధీ 105 జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్చార్జి, రాష్ట్ర బీసీ సెల్ కన్వీనర్, కొత్తకోట్ల సింహాద్రి నాయుడు పూలమాల వేసి నివాళులర్పించిచారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీ, మండల అధ్యక్షుడు కె.జోగినాయుడు, యూత్ కాంగ్రెస్ నాయకుడు జగదీష్ నాయుడు, సూరిబాబు, రాజు, ఎం.గణేష్, తదితరులు పాల్గొన్నారు.

కవిటిలో : శాఖ గ్రంధాలయంలో గ్రంథాలయ అధికారి పూర్ణచంద్ర బెహర ఆధ్వర్యంలో 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకొని మహిళా దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయిని శరీష చేతులమీదుగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు రంగవల్లిక-ముగ్గులు పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన 80 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, రాము, భరత్, సాయి, లోకేష్, వినోద్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో : స్థానిక శాఖాగ్రంధా లయ లైబ్రేరియన్ పూర్ణ చంద్ర బెహరా ఆధ్వ ర్యంలో ఆరవ రోజు నిర్వహించిన కార్య క్రమంలో భాగంగా రంగవల్లికల పోటీలను నిర్వహించారు. దేశ ప్రధమ మహిళా ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని శనివారం మహిళా దినోత్సవంగా జరుపుకున్నారు. సురంగి రాజా ప్రభుత్వ ఉన్నత పాఠశాల అధ్యాపకులు పి.వాసుదేవరావు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతు సమాజంలో మహిళల పాత్ర గూర్చి వివరించారు. కుటుంభ వ్యవస్థలో మహిళల పాత్ర కీలకమైందని తెలిపారు.

పలాస: గ్రంథాలయాలు ధాన్యాగారాలని, విజ్ఞానం పెంచుకునేందుకు గ్రంథాలయం ఎంత గానో ఉపయోగపడ తాయని ఎంపిడివో కార్యాలయం సూపరింటెండెంట్ అనురాధ అన్నారు. కాశీబుగ్గ గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.రాంబాబు, ఉష, జి.రోజా, బి.మంగవతి, పి.హేమంత్, కె.తేజేశ్వరరావు, టి.కుమార్, శ్వేతకుమారి, తేజేశ్వరిలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రుణయాప్‌లు నమ్మి మోసపోవద్దు

డీసీసీబీ మేనేజర్ హేమ సుందర్

విశాలాంధ్ర-కవిటి : ఆన్‌లైన్‌లో రుణ యాప్లను నమ్మి మోసపోవద్దని ఈదుపురం డిసిసి బ్యాంక్ మేనేజర్ ఐ.హేమసుందర్ విద్యార్థులకు సూచించారు. ఈమేరకు శనివారం మండల కేంద్రమైన కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్,జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఈదుపురం ఆధ్వర్యంలో డిజిటల్ బ్యాంకింగ్, ప్రయోజనాలు, ఎదుర్కొంటున్న సమస్యలపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ హేమసుందర్ మాట్లాడుతూ ముఖ్యంగా విద్యార్థులు బ్యాంకు లావాదేవీలు జరిపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అన్నారు.రుణ యాప్ లు చాలా పుట్టుకొస్తున్నాయని అందులో నకిలీ యాప్ లే అధికమని తెలిపారు.మోసం చేయడానికి లింకులు పంపి,వాటిని తాకితే ఎక్కువ మొత్తంలో డబ్బులు పొందవచ్చని నమ్మబలికి మోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్ళ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ నేటి కాలంలో మొబైల్ వాడకంలో విద్యార్థులే ఎక్కువగా ఉన్నారని, తప్పటడుగు వేస్తే కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయని తెలియజేశారు. ఈకార్యక్రమంలో డిసిసిబి సూపర్వైజర్ జి.నవీన్, కవిటి పిఎసిఎస్ సీఈవో జానకిరావు, సిబ్బంది, ఎన్.ఎస్.ఎస్. పి.ఒ.జె. పాపారావు, కళాశాల అధ్యాపక సిబ్బంది నర్సింహ కుమార్ దాస్,పి.హరి, జి.విష్ణుమూర్తి, కె.ఉగాది నాయుడు, డి. అనసూయ, కె. కరుణశ్రీ, బి.శ్రీను బాబు, డి.రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : అంగన్‌వాడీ కార్యకర్తలపై రాజకీయ కక్ష సాధింపుతో తొలగించడం వారి కుటుంబ సభ్యులను వేధించడం తగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు కే.నాగమణి విమర్శించారు. తొల గించిన అంగన్వాడీ కార్యకర్తలతో ఐసిడిఎస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. గత కొంతకాలంగా రాజకీయ కారణాలతో అంగన్వాడీ కార్యకర్తలను ఆయాలను తప్పుడు ఆరోపణలతో కక్ష సాధింపు చర్యలుగా తొలగించడం సబబు కాదని జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు విమ ర్శించారు.

సౌకర్యాలు కల్పిస్తాం... ఇళ్ళు కట్టుకోండి

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పేదవానికి సొంత ఇల్లు ఉండాలనే ఉద్దేశ్యంతోనే పధకాన్ని ప్రవేశపెట్టిందని, జగనన్న కాలనీల్లో లబ్దిదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల తహశిల్దార్ ఎం. లావణ్య, మున్సిపల్ కమీషనర్ ఎన్.రమేష్‌లు అన్నారు. కలెక్టర్ ఆదేశాలతో శనివారం పురుషోత్తపురం వద్ద నిర్మాణదశలో ఉన్న జగనన్న కాలనీని సందర్శించి నిర్మాణాలు ప్రారంభించని లబ్దిదారులను కలిసి పధకం పట్ల వారికి అవగాహన కల్పించి ఇల్లు కట్టుకోవాలని కోరారు. కాలనీలో ఇళ్ళు కట్టుకున్న తర్వాత అవసరమైన సౌకర్యాల మాటేమిటని లబ్దిదారులు ప్రశ్నించగా తగిన సౌకర్యాలు కల్పిస్తాం ముందు ఇళ్ళు కట్టుకోమని విజ్ఞప్తి చేసారు. ఈకార్యక్రమంలో టి.పి.ఎస్. నారాయణరావు, మెప్మా సిఎంఎం జానకి రామారావు తదితరులు పాల్గొన్నారు.